క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఎంపీ దంపతులను సత్కరిస్తున్న కామాక్షితాయి ఆలయ చైర్మన్

బుచ్చిరెడ్డిపాళెం: రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలను జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారి ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, లక్ష్మీకాంతమ్మ దంపతులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఎంపీ నివాసంలో కలిసి స్వామి, అమ్మవారి శేషవస్త్రాలతో వారిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే అమ్మవారి చిత్రపటాన్ని అందించారు.

స్కూటీ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన అయ్యప్ప

మనుబోలు : స్కూటీ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మనుబోలు బైపాస్‌రోడ్డుపై సోమవారం జరిగింది. గూడూరుకు చెందిన అయ్యప్ప స్కూటీపై నెల్లూరు నుంచి గూడూరు వెళ్తున్నాడు. మనుబోలు బైపాస్‌రోడ్డులోని సీఆర్ దాబా సమీపంలో స్కూటీ అదుపుతప్పి పడిపోవడంతో అయ్యప్పకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన్ను స్థానిక పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుస్తుల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలో పనిచేసే సిబ్బందికి 13వ వార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ సోమవారం తన నివాసంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల నగర పంచాయతీ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి దుస్తులు పంపిణీ చేయగా, ఈ దఫా నీటి సరఫరా చేసే సిబ్బందికి దుస్తులు ఇచ్చినట్లు తెలియజేశారు.

చాక్‌పీస్‌పై గిడుగు రామమూర్తి



ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ, సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం సోమవారం చాక్‌పీస్‌పై గిడుగు వేంకట రామమూర్తి చిత్రాన్ని రూపొందించారు. ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా 'తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు' అయిన గిడుగు రామమూర్తి పంతులుకు అంజలి ఘటించారు.

గాయపడిన వ్యక్తి మృతి



మురుగేశన్ మృతదేహం

మనుబోలు : మండలంలోని కృష్ణపట్నం పోర్టు రోడ్డు సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ మురిగేశన్(47) సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 26వ తేదీ తెల్లవారుజామున చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న ట్యాంకర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రంలోని వేలూరుకు చెందిన మురుగేశన్‌కు గాయలయ్యాయి. మొదట ఆయన్ను నెల్లూరుకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మనుబోలు పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నారాయణరావుకు సత్కారం నేడు

నెల్లూరు(బృందావనం): తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించనున్న తెలుగు భాషా వికాస వారోత్సవాలకు నెల్లూరుకు చెందిన కవి చిన్ని నారాయణరావుకు ఆహ్వానం అందింది. కార్యక్రమంలో తనను సత్కరించనున్నారని ఆయన వివరించారు.

ప్రతి ఇంట్లో సంక్షేమ సిరులు

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ సిరులు అందుతున్నాయని, దీని వల్ల ప్రతిగడపలో తమకు విశేషాదరణ లభిస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు రూ.2 లక్షల కోట్లతో సంక్షేమ పథకాలను అందించినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు నియోజకవర్గం పరిధిలోని 83 సచివాలయాల పరిధిలో 97,863 ఇళ్లను సందర్శించామన్నారు. నియోజకవర్గంలో 858 కొత్త పింఛన్లు ఇస్తున్నామన్నారు. బుచ్చిరెడ్డిపాళెం రూరల్ పరిధిలో 100 మందికి, బుచ్చిరెడ్డిపాళెంలో 122 మందికి, కోవూరులో 209, విడవలూరులో 115, కొడవలూరులో 146, ఇందుకూరుపేటలో 166 మందికి పింఛన్లు మంజూరైనాయన్నారు. వీటిని సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో 45 లక్షల మందికే పింఛన్లు ఇవ్వగా, మన ప్రభుత్వంలో 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు.

ఎన్‌ఎస్సార్ ట్రస్ట్ ద్వారా చేయూత

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు ద్వారా పలువురికి సోమవారం ఆర్థిక సాయం చేశారు. వీరిలో ఐరన్ బండి ఏర్పాటు కోసం జ్యోతికి రూ.10 వేలు, అనారోగ్యంతో ఉన్న గుత్తికొండ పద్మావతి, ఆదిలక్ష్మమ్మకు రూ.20 వేలు చొప్పున, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కోట్ల లక్ష్మీనరసింహకు రూ.20 వేలు, గుండె ఆపరేషన్ చేయించుకున్న యాత్రిక్ నందన్‌కు రూ.20 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, ఇందుకూరుపేట కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షాహుల్, కౌన్సిలర్లు యానాది రెడ్డి, మల్లారెడ్డి, నాగరాజు, శ్రీదేవి, శివకుమార్‌రెడ్డి, షకీలాబేగం, రహమత్, జయంతి, చీర్ల ప్రసాద్, పుట్టా లక్ష్మీకాంతమ్మ, అనంతమ్మ, నాయకులు శ్రావణ్, ప్రవల్లిక, అల్లాభక్షు పాల్గొన్నారు.



మహిళకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇంకుడు గుంతలతో బహుళ ప్రయోజనాలు

కొడవలూరు: ఇంకుడు గుంతలతో బహుళ ప్రయోజనాలున్నాయని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని తాటాకుల దిన్నె జగనన్న కాలనీలో నిర్మించుకొంటున్న ఇంకుడు గుంతల(సోక్ పిట్)ను హౌసింగ్ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే ఉపాధి హామీ ద్వారా రూ.6 వేలు చెల్లిస్తారన్నారు. ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలను సంరక్షించుకోవడంతో పాటు రోడ్లపై మురికి నీరు పారకుండా నివారించవచ్చన్నారు. నూతనంగా ఏర్పడుతున్న జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతలు ఆవశ్యమైనందున ప్రతి లబ్ధిదారు విధిగా నిర్మించుకోవాలని కోరారు. ఎంపీడీఓ వెంట హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ జానీ ఉన్నారు.



ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

రోగులతో దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు

• హెచ్‌డీసీ సభ్యుల వెల్లడి

పొదలకూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, దురుసుగా ప్రవర్తించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్‌తో కలిసి హెచ్‌డీసీ సభ్యులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, మొలబంటి శేఖర్‌బాబు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల పట్ల దురుసుగా వ్యవహరించినట్లు సోషల్‌మీడియాలో ప్రచారం కావడంపై వారు స్పందిస్తూ భవిష్యత్తులో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్‌డీసీ చైర్మన్‌గా వ్యవహరిస్తూ ఆస్పత్రిలో అన్నిరకాల సౌకర్యాలను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. చుట్టుపక్కల నాలుగు మండలాలకు కేంద్ర బిందుగా ఉన్న పొదలకూరు సీహెచ్‌సీని ఇంకా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇక్కడ అధునాతన ఎక్స్‌రేప్లాంట్, బ్లడ్ బ్యాంక్ కూడా ఉందన్నారు. ఐసీయూ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అదనపు ఆపరేషన్ థియేటర్‌ను నిర్మించి అన్నిరకాల శస్త్రచికిత్సలను చేయిస్తామన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు గణనీయంగా పెరిగాయని, వైద్యులు అందుబాటులో ఉండడం వల్ల ఓపీ పెరిగిందన్నారు. రోగుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యహరిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా సూచించారు. సమావేశంలో హెచ్‌నర్సు పద్మాంజలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రసాద్

క్షయ, ఎయిడ్స్ నివారణకు చర్యలు

వెంకటాచలం: క్షయ, ఎయిడ్స్ వ్యాధులను పూర్తిగా అరికట్టడానికి తమశాఖ అన్నివిధాలా కృషి చేస్తోందని జిల్లా క్షయ, ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ షేక్.ఖాదర్‌వలీ పేర్కొన్నారు. మండలంలోని కసుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీ) ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో ఉన్న క్షయ, ఎయిడ్స్ బాధితుల వివరాల గురించి వైద్యులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయ, ఎయిడ్స్ వ్యాధుల పట్ల సమాజంలో అవగాహన పెరిగిందని, తద్వారా వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలియజేశారు. ఎయిడ్స్, క్షయ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఎప్పటికప్పుడు సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించి, రోగులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పవిత్ర, ప్రవల్లిక, సీహెచ్‌ఓ రామసుబ్బారెడ్డి, హెచ్‌ఈఓ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కసుమూరు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

టీడీపీ నేతల డ్రామా అట్టర్‌ఫ్లాప్

బుచ్చిరెడ్డిపాళెం : చలో మినగల్లు పేరిట టీడీపీ నాయకులు సోమవారం చేపట్టిన డ్రామా అట్టర్ ఫ్లాప్ అయింది. దీంతో టీడీపీ నాయకులు డీలా పడ్డారు. మండలంలోని మినగల్లు ఇసుక రీచ్ వద్ద అక్రమాలు జరుగుతున్నాయని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పొలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన చలో మినగల్లు కార్యక్రమానికి నియోజకవర్గం మొత్తం మీద కనీసం 50 మంది కూడా రాలేదు. దీంతో ఆ పార్టీ శ్రేణులు దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయారు. వచ్చిన వారితోనైనా డ్రామాను రక్తికట్టించాలని హంగామా చేశారు. దీనిపై పోలీసులు వారించినప్పటికీ వినకుండా వారితోనే టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో చేసేది లేక పోలీసులు వారిని రీచ్ నుంచి బయటకు తీసుకువచ్చారు.



చలో మినగల్లు కార్యక్రమంలో పలుచగా ఉన్న టీడీపీ నేతలు

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. హోమాలు, పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం స్వామివారి గోపురోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్‌ఆచారి, సభ్యుడు నరసింహాచార్యులు పర్యవేక్షించారు.



ఎంపీ ఆదాల పరామర్శ

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు సర్పంచ్ సంగం వెంకయ్య కుటుంబ సభ్యులను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వెంకయ్య సోదరుడు శ్రీనివాసులు సతీమణి మాధవీ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఈ నేపథ్యంలో మైపాడుకు ఎంపీ విచ్చేసి వెంకయ్య కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, స్థానిక నేత దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వినతుల స్వీకరణ

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం డిప్యూటీ తహసీల్దార్ ఎన్‌ఎస్ సాయిగణేష్‌బాబు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పొలం వివాదాలు, దారిగొడవలు, పట్టాదారు పాసుపుస్తకాల కోసం రైతులు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): బైక్‌పై వస్తున్న వ్యక్తిపై కొందరు విచక్షణరహితంగా దాడి చేసిన ఘటన సాలుచింతల సమీపంలోని ఫ్లయ్‌ఓవర్‌పై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన మాల్యాద్రికి స్థానికంగా ఉన్న వారికి స్థల విషయమై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో కోవూరులోని లాయర్ వద్దకు వెళ్లారు. ఆయనతో మాట్లాడిన అనంతరం నెల్లూరులోని తన మామ శేఖర్‌బాబును కలిసేందుకు బైక్‌పై బయల్దేరారు. సాలుచింతల దాటి వెంకటేశ్వరపురం ఫ్లయ్‌ఓవర్‌పైకి వచ్చేసరికి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి స్థల వివాదంలో కేసులు పెడతావా అంటూ కర్రలు, రాడ్లతో విచక్షణరహితంగా దాడి చేశారు. ఇంతలో అటుగా వెళ్తున్న వారు దగ్గరికి రావడాన్ని గమనించిన దుండగులు పరారయ్యారు. గాయపడిన మాల్యాద్రి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఘటనపై జీజీహెచ్ అవుట్‌పోస్ట్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. సంతపేట పోలీసులకు వారు సమాచారం అందించారు.

వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నామని మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచామృతాభిషేకాలను నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు తరలిరావాలని కోరారు.

గోవులను రోడ్లపై వదలొద్దు

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని ముఖ్య కూడళ్లు, ప్రధాన రహదారుల్లో గోవులు సంచరిస్తే వాటి యజమానులకు జరిమానాను విధిస్తామని కమిషనర్ వికాస్ మర్మత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రహదారులపై సంచరిస్తున్న గోవులను నోటీసులను జారీ చేసిన మూడు రోజుల్లో వాటి యజమానులు తీసుకెళ్లాలని చెప్పారు. అలా కాని పక్షంలో యజమానులకు జరిమానాను విధించడంతో పాటు ఆవులను గోశాలకు తరలిస్తామని తెలిపారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది ప్రవీణ్‌కుమార్‌పై దాడి ఘటనకు నిరసనగా కోర్టు విధులను న్యాయవాదులు నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడారు. నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. న్యాయవాదులకు ప్రత్యేక చట్టం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



పుస్తకావిష్కరణ చేస్తున్న వితపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు

వెంకటాచలం : మండలంలోని సరస్వతీనగర్ వద్ద నున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వితపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు భాషోద్యమ పితామహులైన గిడుగు రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా చిత్రకవిత్వం మీద విశేష కృషి చేసిన అలంకారం రమణరాజును సత్కరించి ఆయన రచించిన 'చిత్ర కవితా సౌరభం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కేంద్ర డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, డాక్టర్ జీవీ పూర్ణచంద్, డాక్టర్ శ్రీనివాసతేజ, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు

మనుబోలు : గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంతో కాలంగా మరమ్మతులకు నోచుకోని ఆర్వో ప్లాంట్‌ను సోమవారం ఉపసర్పంచ్ ఆవుల తులసీరాం బాగు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. మండలంలోని జట్లకొండూరు పంచాయతీ పరిధిలోని కుడితిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఉన్న మినరల్ వాటర్‌ప్లాంట్ ఎంతో కాలంగా నిరూపయోగంగా ఉంది. దీంతో తాగునీటికి పాఠశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని తులసీరాం దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఆర్వో ప్లాంట్‌ను బాగు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరేందర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ బండి రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, పెంచలయ్య, శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

పద్మనాభాచార్యులకు పురస్కారం

కోవూరు(విడవలూరు): మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో ఉన్న కోదండరామస్వామి దేవస్థానం అర్చకుడు, అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పరాంకుశం అనంత పద్మనాభాచార్యులకు బంగారు నంది పురస్కారం లభించింది. శ్రీమంజునాథ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో 2023 పురస్కారాల ప్రదానం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పద్మనాభాచార్యులకు బంగారు నంది అవార్డును హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా బహూకరించారు.



అవార్డు అందుకొంటున్న అర్చకుడు పద్మనాభాచార్యులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పొదలకూరు : విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పొదలకూరు ఎస్‌ఈబీ సీఐ వెంకటరావు సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల యువత బంగారు భవిష్యత్తు చిత్తు అవుతుందన్నారు. మాదక ద్రవ్యాలను రవాణా చేసినా, కలిగి ఉన్నా నేరమన్నారు. ఈ సదస్సులో పొదలకూరు సీఐ జి.సంగమేశ్వరరావు, ప్రిన్సిపల్ కె.విష్ణువర్ధన్, సెబ్ ఎస్సై సీహెచ్ శ్రీనివాసులు, వైద్యాధికారులు యు.ప్రసాద్, శివకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెబ్ సీఐ వెంకటరావు

ఇంటి వరండాలోకి దూసుకెళ్లిన లారీ

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద ముంబై జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ట్యాంకర్ రాఘవరెడ్డి కాలనీ సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొని, పక్కన ఉన్న ఇంటి వరండాలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్‌కు గాయాలు కావడంతో అతన్ని 108 వాహనంలో బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.



చెస్ విజేతలకు అభినందన

బుచ్చిరెడ్డిపాళెం : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులను సోమవారం బుచ్చిరెడ్డిపాళెంలో అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి మస్తాన్‌బాబు మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చెస్ పోటీల్లో హిమతేజశ్విని, మారుతీమోహన్, లిఖిత్, యుగేష్, సాయి చరీష్ విజయం సాధించారని తెలిపారు. వీరు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వంశీకృష్ణ, ప్రదీప్ పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన

నెల్లూరు (టౌన్): జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో నేత్రదానంపై అవగాహన సదస్సును జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం, దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ శర్వాణి మాట్లాడారు. నేత్రదానాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు, కార్యదర్శి బాబు, ప్రధాన కార్యదర్శి రోజారాణి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణరావు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ విమల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శర్వాణి

సీఎంకు కృతజ్ఞతలు

నెల్లూరు(పొగతోట): వైద్య, ఆరోగ్య శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్ కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పరిధిలో వైద్యసేవలు అందిస్తున్న అసిస్టెంట్ సివిల్ సర్జన్లు, స్పెషలిస్ట్, డిప్యూటీ సివిల్ సర్జన్లు, స్పెషలిస్ట్ డాక్టర్లకు రూ.15 వేల ప్రత్యేక అలవెన్స్‌ను జీఓ నంబర్ 657 ద్వారా ప్రకటించారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అలవెన్స్‌లను ప్రకటించడంపై ఆనందం వ్యక్తం చేశారు.